సీబీఐకి కళ్లకుర్చి దుర్ఘటన

గవర్నర్‌కు బీజేపీ వినతి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అన్నామలై, తమిళిసై , బీజేపీ నేతలు

పెరంబూర్, జూన్ 24: కళ్లకుర్చి జిల్లా కల్తీ సారా వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు చేయించేలా ఆదేశాలు జారీ చేయాలని గవర్నర్‌కు బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై తదితరులు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిని ఆ పదవి నుంచి తొలగించాలని వారు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో ఈ నెల 18వ తేది కల్తీ సారా తాగి అనారోగ్యానికి గురైన 200 మందికి పైగా ఆసుపత్రిలో చేరగా, వారిలో 60 మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్రప్రభుత్వ ఈ కేసు విచారణను సీబీసీఐడీకి అప్పగించగా, ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 13 మందిని అరెస్ట్ చేశారు. అక్రమ సారా విక్రయాలు అడ్డుకోవడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందంటూ అన్నాడీఎంకే, బీజేపీ తదితర ప్రతిపక్షపార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ నేతలు గవర్నర్ ఆశ్రయించి, ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తుకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

61కి చేరిన కళ్లకుర్చి మృతుల సంఖ్య

- విషమంగా మరో 16 మంది ఆరోగ్యం
- 12 మందికి కంటిచూపు లోపం
- 155 మంది బాధితులకు చికిత్స

అడయార్, జూన్ 24: కళ్లకుర్చి కల్తీసారా ఘటనలో సోమవారం వరకు మృతి చెందిన వారి సంఖ్య 61కు చేరింది. 12 మంది బాధితులు పూర్తిగా కంటిచూపు కోల్పోయారు. సారా తాగి అస్వస్థతకు లోనైన వారిలో 155 మందికి ఆస్పత్రిలో ఇంకా చికిత్స అందిస్తున్నారు. ఈ విషాదకర ఘటనకు కారకులైన వారిని సీబీసీఐడీ వరుసగా అరెస్టులు చేసి, వీరిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని భావిస్తోంది. ఈ నెల 18వ తేదీన కళ్లకుర్చిలో మెథనాల్ కలిసిన కల్తీసారాను దాదాపు 200 మందికి పైగా స్థానికులు తాగారు. వీరిలో ఇప్పటివరకు 61 మంది చనిపోయారు. కల్తీసారా బాధితులను కళ్లకుర్చితో పాటు విల్లుపురం, సేలం, పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. అయితే బాధితుల్లో 19వ తేదీ 17 మంది, 20వ తేదీ 24 మంది, 21న 9 మంది, 22న ఐదుగురు మొత్తం 55 మంది మృతి చెందారు. అయితే, ఈ మృతుల సంఖ్య సోమవారానికి 61కు చేరింది. అలాగే, కళ్లకుర్చి ప్రభుత్వ ఆస్పత్రిలో 109 మంది, సేలం ప్రభుత్వ కాలేజీ ఆస్పత్రిలో 30 మంది, పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రిలో 12 మంది, విల్లుపురం ప్రభుత్వ వైద్య కాలేజీ ఆస్పత్రిలో నలుగురు మొత్తం 155 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 16 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ కల్తీ సారా బాధితుల్లో 12 మంది పూర్తిగా కంటిచూపు కోల్పోయారు. మిగిలిన వారి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు. మరోవైపు, కల్తీసారా తయారీకి సహకరించిన వారితో పాటు కల్తీసారా విక్రయించిన వారు, సరఫరా చేసినవారు, ఈ సారా తయారీకి ముడి సరుకు సరఫరా చేసిన వారు మొత్తం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కూడా అయ్యాస్వామి, దేవేంద్రన్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు చేసిన వారి సంఖ్య 14కు చేరింది. మరోవైపు, ఈ కేసు విచారిస్తున్న సీబీసీఐడీ అరెస్టు చేసిన వారందరినీ కస్టడీలోకి తీసుకుని విచారించాలని భావిస్తోంది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.4వేల కోట్ల కేటాయింపు
- అసెంబ్లీలో ప్రకటించిన సీఎం స్టాలిన్



శాసనసభ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం కింద రాష్ట్రంలో 10 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను అభివృద్ధి పరచనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. శాసనసభలో సోమవారం ఉదయం ఆయన సభానిబంధన 110 కింద ఓ ప్రకటన చేస్తూ... గ్రామీణ రహదారుల అభివృద్ధి పనుల కోసం రూ.4వేల కోట్ల మేర నిధులు కూడా కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నగర పంచాయతీలు, గ్రామపంచాయతీలు, పంచాయతీ యూనియన్లలో 1.38 లక్షల కిలోమీటర్ల పొడవుతో కూడిన రహదారులున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను అభివృద్ధి పరచేందుకు తమ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పండించే వరి తదితర ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కూడా రహదారులను అభివృద్ధిపరచాల్సిన అవసరం ఉందని భావించే తమ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నదని వెల్లడించారు. విద్య, ఆరోగ్యం తదితర సేవలు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలన్నా రహదారులు బాగుండాలన్నారు. ఈ నేపథ్యంలోనే గతేడాది జనవరి 13న శాసనసభలో ముఖ్యమంత్రి గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించానని, ఆ పథకం ద్వారానే ప్రస్తుతం గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు స్టాలిన్ వివరించారు. ప్రస్తుతం 8120 కిలోమీటర్ల పొడవు కలిగిన గ్రామీణ రహదారులను అభివృద్ధి చేశామని, అదనంగా మరో 10 వేల కిలోమీటర్ల పొడవు రహదారులను మరమ్మతు చేయనున్నామని చెప్పారు. రెండేళ్లలో ఈ రహదారుల మరమ్మతు పనులు పూర్తవుతాయని తెలిపారు.

రెండేళ్లలో చెక్‌డ్యామ్‌లు: మంత్రి దురైమురుగన్

రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్లలో అన్ని చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు పూర్తవుతాయని నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. శాసనసభలో సోమవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో ఆత్తూరు శాసనసభ్యుడు జయశంకరన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఆత్తూరు నియోజకవర్గం పరిధిలోని విల్లవనూరు వశిష్ట నదిపై చెక్‌డ్యామ్ నిర్మించేందుకు ప్రాథమిక స్థాయి పనులు జరుగుతున్నాయని, త్వరలో నిధులు కేటాయించి చెక్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇదే విధంగా పన్రుట్టి నియోజకవర్గ పరిధిలోని పట్టాంబాక్కం సమీపంలో చెక్ డ్యామ్ లేకపోవడం వల్ల ఇటీవల వరదల్లో ఐదుగురు కొట్టుకుపోయి మృతి చెందారని, ఆ చోట చెక్ డ్యామ్ నిర్మించేందుకు చర్యలు చేట్టాలని మరో ఎమ్మెల్యే వేల్‌మురుగన్ కోరారు. వీలయినంత త్వరగా ఆ ప్రాంతంలో చెక్‌డ్యామ్ నిర్మిస్తామని, అంతే కాకుండా రెండేళ్లలోపున చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి దురైమురుగన్ ప్రకటించారు.

పర్యాటక ప్రాంతంగా కల్వరాయన్ మలై

కళ్లకుర్చి సమీపంలోని కల్వరాయన్‌మలైని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కె.రామచంద్రన్ తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు కొంగు ఈశ్వరన్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ కల్వరాయన్ మలై చారిత్రక ప్రాముఖ్యత కలిగిన పర్వత ప్రాంతమని, దానిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ముఖ్యమంత్రి అనుమతి తీసుకుని తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అమ్మా క్యాంటీన్ సిబ్బంది వేతనం పెంపు

- చెన్నై కార్పొరేషన్ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ ఆర్.ప్రియ

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని అమ్మా క్యాంటీన్లలో పనిచేస్తున్న సిబ్బంది రోజు కూలీని రూ.325లకు పెంచుతున్నట్లు మేయర్ ఆర్. ప్రియ ప్రకటించారు. సోమవారం ఉదయం జరిగిన కార్పొరేషన్ సాధారణ సమావేశంలో ఆ మేరకు ప్రతిపాదించిన తీర్మాణాన్ని సభ్యులు ఆమోదించారు. అన్నాడీఎంకే సభ్యులు కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనకు డీఎంకే ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్యవైఖరిని ఖండిస్తూ నల్ల చొక్కాలతో ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే పాఠశాలల్లో కుల, మత రహిత విధానాలు అమలు చేయాలంటూ జస్టిస్ చంద్రూ కమిటీ నివేదికను నిరసిస్తూ ఆ నివేదిక ప్రతులు కొన్నింటిని చింపి బీజేపీ కౌన్సిలర్ ఉమా ఆనంద్ సభ నుండి నిష్క్రమించారు. ఆమె చేష్టలను డీఎంకే కౌన్సిలర్లు ఖండించారు. నగరంలో 2500 చదరపుటడుగులకు మించని స్థలాలకు, 3500 చదరపుటడుగులకు మించని భవనాలకు ఏకగవాక్ష పద్ధతిలో కార్పొరేషన్ అనుమతిస్తుందని మేయర్ తెలిపారు. నగరంలోని క్రైస్తవ సిమెట్రీలను నిర్మించేందుకు కూడా సభలో కొత్త నిబంధనలు అమలు చేయనున్నట్లు ఆమె ప్రకటించారు. ఆ ప్రకారం 18 చదరపుటడుగులకు మించకుండా సిమెట్రీలను ఏర్పాటు చేస్తే చదరపుటడుగుకు రూ.500ల చొప్పున వసూలు చేస్తామన్నారు. నగరంలోని అమ్మా క్యాంటీన్లలో పనిచేస్తున్న మహిళా స్వయంసంఘాల సభ్యులకు చెల్లిస్తున్న దినసరి కూలీని రూ.300ల నుంచి రూ.325కు పెంచుతున్నట్లు ఆమె ప్రకటించారు. ఐదోజోన్‌లో రూ.87 కోట్లతో నిర్మించిన భవనసముదాయానికి ముత్తమిళ్ అరింజర్ మాళిగై అనే పేరుపెట్టాలని ప్రతిపాదించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న ప్రాథమిక పాఠశాలల్లో యూకేజీ, ఎల్కేజీ తరగతులు ప్రారంభించి, కొత్తగా ఉపాధ్యాయులను నియమించేందుకు కార్పొరేషన్ అనుమతిని మంజూరు చేసిందని మేయర్ ప్రియా తెలిపారు.

విక్రవాండి ఉప ఎన్నిక ....

26 వరకు ఉపసంహరణ

ముగిసిన నామినేషన్ల పరిశీలన



నామినేషన్ల పరిశీలన కార్యక్రమానికి హాజరైన అభ్యర్థులు

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన సోమవారం ముగిసింది. నామినేషన్ల పరిశీలన అనంతరం 29 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయంటూ ఎన్నికల నిర్వహణాధికారి ప్రకటించారు. విక్రవాండి ఉప ఎన్నికలు జూలై 10న నిర్వహించి, 13న ఓట్ల లెక్కింపు చేసి అదే రోజు మధ్యాహ్నం ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఈ నెల 14న ప్రారంభమై 21న ముగిసింది. డీఎంకే తరఫున అన్నియూర్ శివా, పీఎంకే తరఫున సీ.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా డాక్టర్ అభినయ ఈ ముగ్గురి డమ్మీ అభ్యర్థుల నామినేషన్లు సహా మొత్తం 64 నామినేషన్లు స్వీకరించారు. ఈ నామినేషన్ల పరిశీలన సోమవారం ఉదయం 11 గంటలకు జరిగింది. వివిధ కారణాల వల్ల 35 నామినేషన్లను తిరస్కరించారు. 29 నామినేషన్లను అంగీకరించారు. ఈ నెల 26 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుండటంతో ఆలోపున మరికొందరు నామినేషన్ల ఉపసంహరించుకునే అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేయనున్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

కల్తీ సారాను పట్టించుకోరేం?

- అందుకే ఇంత అనర్థం
- కళ్లకుర్చిలో సీఎంపై ఈపీఎస్ ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా అన్నాడీఎంకే నిరసనలు



పాల్గొన్న కార్యకర్తలు

ప్యారీస్, జూన్ 24: రాష్ట్రంలో బహిరంగంగా జరుగుతున్న కల్తీ సారా విక్రయాలను ముఖ్యమంత్రి స్టాలిన్ పట్టించుకోలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. కళ్లకుర్చి కల్తీ సారా వ్యవహారాన్ని ఖండిస్తూ సోమవారం అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించింది. కళ్లకుర్చిలో జరిగిన ధర్నాలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదకద్రవ్యాలు, కల్తీ సారా విక్రయాలు అధికారపార్టీకి చెందిన నేతల అండదండలతో జరుగుతున్నందున పోలీసు శాఖ చూసిచూడనట్లు వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఈ వ్యవహారంలో నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. కల్తీ సారా తాగి 61 మంది నిండు ప్రాణాలు బలవ్వగా, మరో 100 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, అయినా డీఎంకే కూటమిలోని మిత్రపక్షాలు ఈ దుర్ఘటనను ఖండించకపోవడం దురదృష్టకరమన్నారు. కళ్లకుర్చి మృతులకు సీఎం స్టాలిన్ కారణమని, దీనిపై ఆయన నైతిక బాధ్యత వహించి సీఎం పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కళ్లకుర్చి ప్రజలకు న్యాయం జరగాలంటే సీబీఐ విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీలో మాదకద్రవ్యాలు, కల్తీ సారా అమ్మకాల గురించి మాట్లాడేందుకు ప్రతిపక్షాల సభ్యులకు స్పీకర్ అప్పావు అనుమతించడం లేదని, ఏవైనా ప్రధాన సమస్యలుంటే మాట్లాడాలని చెబుతున్నారని, ప్రస్తుతం కళ్లకుర్చి దుర్ఘటన కంటే ప్రధాన సమస్య ఏముందని ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్తీ సారా మరణాలకు న్యాయం చేయాలని కోరడం ఎలా తప్పవుతుందని, అన్నాడీఎంకే తరఫున నిరసన తెలిపేందుకు కూడా ప్రభుత్వం అవకాశమివ్వలేదని, పలు ప్రాంతాల్లో ధర్నాలో పాల్గొనకుండా తమ పార్టీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం ఖండించదగ్గదన్నారు. కాగా, కళ్లకుర్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న పళనిస్వామి సహా పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు నల్లచొక్కాలు ధరించడం గమనార్హం.

నేడు గవర్నర్‌తో భేటీ

కళ్లకుర్చి జిల్లాలో కల్తీ సారాకు 61 మంది బలైన సంఘటనపై రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవితో అన్నాడీఎంకే నేతలు మంగళవారం భేటీ కానున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో కూడిన బృందం గవర్నర్‌ను కలిసి కళ్లకుర్చి దుర్ఘటనపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ వినతిపత్రం సమర్పిస్తారని పళనిస్వామి ప్రకటించారు.

లోకేశ్‌కు చంద్రశేఖర్ శుభాకాంక్షలు

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం అమరావతిలోని సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ చెన్నై అధ్యక్షుడు, సత్యవేడు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చంద్రశేఖర్ ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిపైనా, చెన్నైలోని తెలుగు వారి సమస్యలపైనా ప్రత్యేక చొరవ చూపించాలని లోకేశ్‌కు విన్నవించినట్లు చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు.



ఏపీ సచివాలయంలో లోకేశ్‌ను కలిసిన చంద్రశేఖర్

టెక్నో పోలీస్

- చోరీకి గురైన వాహనాల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు
- అమలు చేసిన నగర పోలీసు శాఖ

పెరంబూర్, జూన్ 24: నగరంలో అధికమవుతున్న ద్విచక్ర వాహనాల చోరీలను అడ్డుకునేందుకు నగర పోలీసు శాఖ ప్రత్యేక వ్యూహం రూపొందించింది. తద్వారా వాహనం చోరీకి గురైన కొద్ది నిమిషాల్లోనే ఎక్కడుందో తెలుసుకునేందుకు అవకాశమున్నట్లు తెలిసింది. రాజధాని నగరం చెన్నైకి ఉపాధి కోసం వస్తున్న వారు ఇక్కడే ఇళ్లు అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. కొన్నింట్లలో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్ల పక్కనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న పలువురు వాహనాల చోరీలకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినా ఫలితం వుండడం లేదు. ఈ క్రమంలో, పోలీసు శాఖ తాజాగా 'ఇంటిగ్రేటెడ్ వెహికల్ ట్రాకర్' అనే పరికరాన్ని పరిచయం చేసింది. ఈ పరికరంలో చోరీకి గురైన వాహన నెంబరు నమోదుచేస్తే, నగరంలో 28 ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా, ఆ వాహనం ఏ ప్రాంతంలో ఉందో గుర్తించి, వెంటనే పోలీసుల వాట్సాప్ నెంబరుకు మెసేజ్ పంపుతుంది. ఈ పరికరం ద్వారా 2021 నుంచి చోరీకి గురైన 3,200 వాహనాల నెంబర్లు నమోదుచేసి, వాటిని గుర్తించే చర్యలు చేపట్టినట్లు నగర పోలీసు శాఖకు చెందిన సీనియర్ అధికారి తెలియజేశారు.



పోలీసులు వినియోగిస్తున్న సరికొత్త పరికరం



తమిళ కవి, సినీ గేయరచయిత కణ్ణదాసన్ 98వ జయంతి సందర్భంగా టి.నగర్‌లోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు ఎంపీ సామినాథన్, ఎం.సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి ఎల్.సుబ్రమణియన్, పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్ తదితరులు

సమాచార ధ్వని

డిప్లొమో కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 24: చెన్నై ఐఐటీ, చెన్నై మెట్రోరైల్ సంస్థ (సీఎంఆర్ఎల్) సంయుక్తంగా నిర్వహించనున్న కొత్త డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 29వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రెండు సంస్థలు మెట్రోరైలు సాంకేతికత, నిర్వహణ (పీజీడీ ఎంఆర్టీఎం) అనే ఏడాది పీజీ డిప్లొమో కోర్సు పరిచయం చేశాయి. ఈ కోర్సులో చేరేందుకు బీఈ, బీటెక్ పూర్తిచేసిన వారు careers.chennaimetrorail.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నెలకు రూ.30,000 ఉపకారవేతనం అందజేస్తారు. కోర్సు పూర్తికాగానే సీఎంఆర్ఎల్ సంస్థలో నెలకు రూ.62,000 వేతనంతో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులో నియమిస్తారు. వివరాలకు 044-24378000 అనే నెంబరు సంప్రదించవచ్చు.

నర్సులకు జర్మనీ, జపాన్ భాషలపై శిక్షణ

పెరంబూర్, జూన్ 24: జర్మనీ, జపాన్ తదితర దేశాలకు ఉద్యోగం కోసం వెళ్తున్న నర్సుల సౌకర్యార్థం, జర్మనీ, జపాన్ భాషలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ భాషలు నేర్చుకోవాలనుకొనే నర్సులు, బీఎస్సీ నర్సింగ్, డిప్లొమో నర్సింగ్ పూర్తిచేసి ఉండాలి. వారి వారి వసతులను బట్టి శిక్షణ ఆన్‌లైన్ ద్వారా, నేరుగా అందించేలా వెసులుబాటు కల్పించారు. ఈ శిక్షణకు హాజరు కావాలనుకొనే వారు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదుచేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6379179200 నెంబరుకు సంప్రదించాలని రాష్ట్రప్రభుత్వ విదేశీ ఉద్యోగాల కల్పన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీఎస్ మహేశ్వరన్ ఒక ప్రకటనలో తెలిపారు.

మెట్రోరైళ్లలో డైనమిక్ రూట్ మ్యాప్

ఐసిఎఫ్, జూన్ 24: మెట్రోరైళ్లలో డైనమిక్ రూట్ మ్యాప్‌లను సీఎంఆర్ఎల్ త్వరలో పరిచయం చేయనుంది. నగరంలో మెట్రోరైలు సేవలను రోజుకు లక్షలాది మంది వినియోగించుకుంటున్నారు. ప్రతిరోజు 54 కి.మీ మేర సీఎంఆర్ఎల్ 600 ట్రిప్పులు నిర్వహిస్తోంది. రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో 46 రైళ్లు, రద్దీ తక్కువగా ఉన్న సమయాల్లో 35 రైళ్లు నడుపుతోంది. ఈ రైళ్లు కొత్తగా ప్రయాణించే వారికి వెళ్లే మార్గం, తరువాత స్టేషన్ వంటి సమాచారం తెలియజేసేలా డైనమిక్ రూట్ మ్యాప్ సిస్టమ్‌ను త్వరలో మెట్రోరైళ్లలో అమర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.1.65 కోట్లతో మనలిలో పార్క్

ఐసిఎఫ్, జూన్ 24: స్థానిక మనలి మండలంలో రూ.1.65 కోట్లతో కొత్త పార్క్ ఏర్పాటుకానుంది. 22వ వార్డులో చిన్నసేకాడు, అవురికొలైమేడు, బలిజపాళయం వంటి ప్రాంతాల్లో 50కి పైగా వీధులుండగా, సుమారు 50వేల మందికి పైగా నివసిస్తున్నారు. బలిజపాళయంలో కార్పొరేషన్‌కు చెందిన 5.5 ఎకరాల స్థలంలో క్రీడామైదానంతోపాటు కొత్తపార్క్‌ను త్వరలో ఏర్పాటుచేయనున్నామని అధికారులు తెలిపారు.

నేడు, రేపు భారీ వర్షసూచన

పెరంబూర్, జూన్ 24: దక్షిణ దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా మంగళ, బుధవారాల్లో 8 జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. నీలగిరి, కన్నియాకుమారి, తిరుప్పూర్, తేని, దిండుగల్, తెన్‌కాశి, తిరునల్వేలి, కోయంబత్తూర్ తదితర జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీగా, ఒకటి, రెండుప్రాంతాల్లో అతిభారీవర్షాలు కురిసే అవకాశముంది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

అన్ని జిల్లాల్లో వ్యవసాయ సలహా కేంద్రాలు

ఐసిఎఫ్, జూన్ 24: వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, మార్గదర్శకాలను రైతులు సులభంగా తెలుసుకొనేలా అన్ని జిల్లాల్లో సలహా కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. కాంచీపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఉద్యానవన ఫారాల్లో మౌలికవసతుల కల్పనకు రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో నివారణ పనులు చేపట్టేందుకు రూ.25 లక్షలు కేటాయిస్తామన్నారు. ఉళవర్ యాప్‌లో ప్రైవేటు చెరుకు కోత యంత్రాలు, డ్రోన్లు వంటి వాటికి సంబంధించిన వివరాలు అప్‌లోడ్ చేసి, 388 పంచాయతీ యూనియన్లలో వీటిపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేయడంపై అన్ని జిల్లాల్లో సలహా కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు.

నేత్రదానం

వేలూరు, జూన్ 24: గుడియాత్తం బోడిపేటకు చెందిన మంగళగౌరి (65) ఆదివారం మృతిచెందింది. ఆమె కోరిక మేరకు భర్త, ఇద్దరు కొడుకులు ఆమె కళ్లు దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా ఆమె నేత్రాలు పొంది అవసరమైన వారికి అమర్చనున్నట్లు, నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులకు ఆస్పత్రి నిర్వాహకులు కృతజ్ఞత తెలిపారు.

సారా విక్రయాలపై ఫిర్యాదు చేయండి

వేలూరు, జూన్ 24: కళ్లకుర్చి కల్తీ సారా ఘటన నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సారా విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. సారా చేసే కొండ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టడం, సారా ఊట ధ్వంసం, సారాతయారీ, విక్రయదారులను అరెస్ట్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో సారా విక్రయాలపై ప్రజలు 9087756223, 8838608868 అనే నెంబర్లకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ మణివన్నన్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

30న తరతరాల తెలుగు కవిత

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన 'తరతరాల తెలుగుకవిత' ఉపన్యాస ధారావాహిక 150వ ప్రసంగ కార్యక్రమం జరుగనుంది. టీనగర్ విజయరాఘవ రోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరుగనున్న కార్యక్రమంలో 'సాహిత్యం-చమత్కార వైభవం' అనే అంశంపై ముంబైకి చెందిన సాంప్రతి సురేంద్రనాథ్ ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాజీ మంత్రి నివాసంలో చోరీ

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా మోడకురిచ్చి సమీపంలో మాజీ మంత్రి సుబ్బులక్ష్మి జగదీశన్‌కు చెందిన ఫామ్‌హౌస్‌లో సోమవారం వేకువజాము గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.50వేల నగదు విలువైన వస్తువులు చోరీ చేసుకెళ్లారు. మలైపాళయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

అవయవదానం చేసిన మహిళకు ప్రభుత్వ లాంఛనాలు

పెరంబూర్, జూన్24: తిరుప్పూర్‌లో ప్రమాదంలో మృతిచెందిన మహిళా కార్మికురాలు అవయవదానం చేయడంతో, ఆమె భౌతికకాయానికి సోమవారం ప్రభుత్వ లాంఛనాలతో నివాళులర్పించారు. తిరుప్పూర్ కార్పొరేషన్ పారప్పాళయం మహాలక్ష్మి నగర్‌కు చెందిన పుష్పలత(50) బనియన్ సంస్థలో పనిచేస్తోంది. ఈనెల 21వ తేది రాత్రి ఆమె విధుల నుంచి ఇంటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుప్పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక 23వ తేది ఆమె మెదడు నిర్జీవమైంది. వైద్యుల సూచనల మేరకు ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో, సోమవారం ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా రెండు కిడ్నీలు తీసిన వైద్యులు, కోవై, సేలంలోని ఆసుపత్రులకు తలా ఒకటి చొప్పున అందజేశారు. పుష్పలత మృతదేహానికి వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మురుగేశన్ నేతృత్వంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది ప్రభుత్వ లాంఛనాలతో అంజలి ఘటించారు. ఆమె మృతదేహాన్ని ఆసుపత్రి ప్రవేశద్వారం వరకు తీసుకొచ్చి అంబులెన్స్‌లో ఇంటికి పంపించారు.



పుష్పలత భౌతిక దేహానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

చెన్నై, మదురై, కోవైలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు

● మంత్రి గీతాజీవన్

ప్యారీస్, జూన్ 24: చెన్నై, మదురై, కోవై మహానగరాల్లో పనిచేస్తున్న మహిళల సౌకర్యార్థం ఈ ఏడాది కొత్తగా ఉమెన్స్ హాస్టల్స్‌ను నిర్మించనున్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ పేర్కొన్నారు. విల్లివాక్కం నియోజకవర్గ పరిధిలోని అయ్యాపాక్కంలో పనిచేస్తున్న మహిళల కోసం హాస్టల్ నిర్మించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుందా అని అసెంబ్లీలో సోమవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో మధురవాయల్ ఎమ్మెల్యే గణపతి ప్రశ్నించారు. దీనిపై మంత్రి గీతాజీవన్ స్పందిస్తూ... గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో అడయార్‌లో 98 పడకల వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పనిచేస్తుందని తెలిపారు. అదేవిధంగా, సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతంలో ఓ హాస్టల్ నిర్మాణంలో ఉందని, నగరంలో పనిచేస్తున్న మహిళల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల సంఖ్య పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మధురవాయల్ నియోజకవర్గంలో 97 ప్రైవేటు వర్కింగ్ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయని, అయినా ప్రభుత్వం తరపున ఏర్పాటుచేసేందుకు పరిశీలిస్తామన్నారు. చెన్నై, మదురై, కోవై నగరాల్లో అదనంగా ఉమెన్స్ హాస్టల్స్ నిర్మించేందుకు అనువైన స్థలాలు ఎంపిక చేసే పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

కాట్పాడి తాలూకా కార్యాలయంలో గ్రీవెన్స్



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ కవిత

వేలూరు, జూన్ 24: స్థానిక కాట్పాడి తాలూకా ఆఫీసులో జమాబందీ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ కవిత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ జమాబందీలో కాట్పాడి తహసీల్దార్ శరవణన్, ట్రైబల్స్ తహసీల్దార్ సెంథిల్, ఉప తహసిల్దార్ శివకుమార్, గ్రామ నిర్వాహక అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు అన్బరసు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ఖండిస్తూ అన్నాడీఎంకే ధర్నా

వేలూరు, జూన్ 24: ప్రభుత్వ తీరును ఖండిస్తూ సోమవారం జిల్లాలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అన్నా ఆడిటోరియం సమీపంలో చేపట్టిన ధర్నాకు పార్టీ సెక్రటరీ వి.రాము నేతృత్వం వహించారు. . కార్యాక్రమానికి జిల్లా యువజన విభాగం నేత ఎం.కుమార్ అధ్యక్షత వహించగా, జిల్లా కోశాధికారి మూర్తి, మానగర జిల్లా సెక్రటరీ అప్పు సహా పలువురు నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొని, డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విశ్వకర్మ స్నేహితుల సంఘం వార్షికోత్సవం



జనార్ధనన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు, జూన్ 24: విశ్వకర్మ స్నేహితుల సంఘం 23వ వార్షికోత్సవం, పదవీవిరమణ పొందిన సభ్యుల అభినందన కార్యక్రమం సోమవారం ఆవిన్‌ఇన్ ఆడిటోరియంలో జరిగింది.. కార్యక్రమంలో శివరాజ్ జ్ఞాన ఆచారి గురుస్వామి, సంఘ స్థాపక సెక్రటరీ జనార్ధనన్ పాల్గొన్నారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు తేజోమూర్తి అధ్యక్షత వహించగా, కమిటీ అధ్యక్షుడు అన్బరసు ఆహ్వానం పలికారు. ఇందులో ఇటీవల పదవీవిరమణ పొందిన టెక్నికల్ ఉపాధ్యాయులు జనార్ధనన్‌ను శివరాజ్ గురుస్వాములు శాలువ కప్పి సత్కరించారు.

తప్పిపోయిన పోలీసులు సురక్షితం

పెరంబూర్, జూన్ 24: కళ్లకుర్చి జిల్లాలోని కాల్వరాయన్ కొండల్లో సారా స్థావరాలపై దాడి వెళ్లి తప్పిపోయిన ఏడుగురు పోలీసులు సురక్షితంగా తిరిగొచ్చారని పోలీసు శాఖ తెలియజేసింది. సారా విక్రయాలపై ఎక్సైజ్, పోలీసు శాఖల సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా, కొండ ప్రాంతాల్లో సారా తయారీ అధికంగా ఉందనే సమాచారంతో ఆ ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో, కళ్లకుర్చి జిల్లా కల్వరాయన్ కొండ ప్రాంతంలో సారా స్థావరాలపై దాడికి వెళ్లిన తిరుచ్చి బెటాలియన్‌కు చెందిన 20 మంది పోలీసుల్లో 13 మంది మాత్రమే తిరిగి రావడంతో మిగిలిన వారు తప్పిపోయారని భావించారు. కానీ, వారు రెండు గంటలు విశ్రాంతి తీసుకున్న అనంతరం కిందకు దిగివచ్చినట్లు పోలీసు శాఖ తెలియజేసింది.

మూడు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, జూన్ 24: కోయంబత్తూర్, తిరుచ్చి, చెన్నై విమానాశ్రయాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఉగ్రవాద సంస్థల పేరుతో వచ్చిన ఈ-మెయిల్‌ను పరిశీలించిన కోవై విమానాశ్రయ అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలాల బృందాలు అక్కడకు చేరుకొని విమానాశ్రయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, బాంబు బెదిరింపు ఫేక్ న్యూస్ అని నిర్ధారించారు. అలాగే, చెన్నై విమానాశ్రయానికి ఏడో సారిగా ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. గతంలో వచ్చిన బెదిరింపుల కారణంగా విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టం చేసిన నేపథ్యంలో, సోమవారం వచ్చిన మరో బెదిరింపుతో బాంబ్ స్క్వాడ్ విమానాశ్రయం, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అలాగే, తిరుచ్చి విమానాశ్రయానికి కూడా బెదిరింపులు రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ మూడు ఘటనల్లో బాంబులు లభ్యం కాకపోవడంతో ఫేక్ న్యూస్ అని నిర్ధారించిన పోలీసులు, బాంబు బెదిరింపులకు పాల్పడిన ఈ-మెయిల్ ఎక్కడ నుంచి వచ్చిందని విచారిస్తున్నారు.

శ్రీరామచంద్రలో 'రేడియేషన్ ఎక్స్‌పోజర్'పై సదస్సు



సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అడయార్, జూన్ 24: స్థానిక పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్‌లో 'బయోమార్క్స్ ఇన్ రేడియేషన్ ఎక్స్‌పోజర్' అనే అంశంపై మూడు రోజుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఇండో యూఎస్ వర్క్‌షాపు పేరిట నిర్వహించే ఈ సదస్సును కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన రేడియోలాజికల్ రీసెర్చ్ యాక్సిలీరేటర్ ఫెసిలిటీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గై గార్టీ ప్రారంభించగా, ఇందులో శ్రీరామచంద్ర రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హర్యామన్ జెనెటిక్స్ విభాగం హెడ్, ఈ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ వి.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు. శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ వైస్ చాన్సెలర్ డాక్టర్ ఉమ శేఖర్, రేడియాలజీ అండ్ ఇమేజింగ్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధా వారియర్, బయోమెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రతినిధులు, వర్క్‌షాపు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు అన్నాడీఎంకే గైర్హాజరు

అడయార్, జూన్ 24: రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరుగుతుండగా, సోమవారం జరిగిన సభా కార్యక్రమాలకు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే దూరంగా ఉన్నది. సోమవారం జరిగిన సమావేశాల్లో ఉన్నత విద్య, రెవెన్యూ, ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిమాపకదళం, పాఠశాల విద్య తదితర శాఖల పద్దులపై చర్చ జరిగింది. అన్నాడీఎంకే సభ్యులు మాత్రం సభా కార్యక్రమాలకు దూరంగా ఉండటం గమనార్హం.

జాలర్ల విడుదల కోసం రామేశ్వరంలో సమ్మె

అడయార్, జూన్ 24: శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన 22 మంది జాలర్లను విడిపించాలని కోరుతూ రామేశ్వరం ప్రాంతానికి చెందిన జాలర్లంతా సోమవారం సమ్మెకు దిగారు. ఈ కారణంగా చేపల వేట పూర్తిగా నిలిచిపోయింది. మూడు రోజుల క్రితం రామనాథపురం రామేశ్వరం ప్రాంతానికి చెందిన 500 మందికిపైగా జాలర్లు చేపల వేటకు వెళ్లారు. వీరిలో 22 మందిని శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. మూడు మరబోట్లను కూడా స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత లంక కోర్టులో హాజరుపరచగా వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ జాలర్లకు రిమాండ్ విధించింది. అయితే, రామేశ్వరం ప్రాంతానికి చెందిన జాలర్లు... సహచర మత్స్యకారుల అరెస్టుకు నిరసనగా, వారిని తక్షణం విడిపించాలని కోరుతూ సమ్మెకు దిగారు. తమ బోట్లను తీరంలోనే లంగరు వేసి తమ నిరసన తెలిపారు.

ఈపీఎస్‌పై పరువునష్టం దావా

అడయార్, జూన్ 24: మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామిపై ఆ పార్టీ మాజీ నేత, మాజీ మంత్రి కేసీ పళనిస్వామి కోయంబత్తూరు మేజిస్ట్రేట్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. ఈ నెల 26 తేదీన ఈ కేసు విచారణ జరుగనుంది. ఇటీవల కోవై ఎయిర్‌పోర్టులో పళనిస్వామి విలేకరులు అడిగిన ప్రశ్నలకు కోవైకు చెందిన ఒక నేత (ఓపీఎస్ వర్గ నేత కేసీ పళనిస్వామి) మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం కాలంలో అన్నాడీఎంకేలో చేరారు. టీవీల్లో చర్చా కార్యక్రమాల కోసం మీకు నచ్చిన వ్యక్తిని కూర్చోబెట్టుకుంటారు అంటూ ఈపీఎస్ మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న కేసీ పళనిస్వామి మాజీ సీఎం ఈపీఎస్‌పై కోయంబత్తూరు మేజిస్ట్రేట్ ఒకటో నంబరు కోర్టులో పరువునష్టం దావా వేయగా, ఈ పిటిషన్‌పై ఈ నెల 26వ తేదీన విచారణ జరుగనుంది.

ఆర్కాట్ సాలైను విస్తరించాలి

● ఎమ్మెల్యే గణపతి డిమాండ్

అడయార్, జూన్ 24: స్థానిక కోడంబాక్కం నుంచి పోరూర్ కూడలి వరకు ఉన్న ఆర్కాట్ సాలైను ఆరు లేన్ల రహదారిగా విస్తరించాలని మధురవాయల్ ఎమ్మెల్యే కారపాక్కం గణపతి కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, నగరంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందన్నారు. ముఖ్యంగా ఆర్కాట్ సాలైలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంది, ట్రాఫిక్ సమస్య వల్ల గంటలపాటు వాహనదారులు చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఈ రహదారిని ఆరు లేన్లగా మార్చాలని ఆయన సభలో కోరారు

అమ్మకాల తగ్గుముఖం

మళ్లీ ప్రైవేటు పాల ధర తగ్గింపు

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పాల విక్రయాలు తగ్గుముఖం పడుతుండటంతో ప్రైవేటు పాల తయారీ సంస్థలు మరోమారు ధరలను తగ్గించాయి. పాలు, పెరుగు అమ్మకాలు తగ్గుతుండటంతో వాటి ధరలను తగ్గించాలని ప్రైవేటు పాల ప్యాకెట్లను సరఫరా చేస్తున్న ఏజెంట్లు ఆ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు హట్సన్ తదితర సంస్థలు ఈ నెల 18న పాల ధరను లీటర్‌కు రూ.2లచొప్పున, పెరుగు ధరను కేజీకి రూ.4లు చొప్పున తగ్గించాయి. తక్కిన ప్రైవేటు సంస్థలు కూడా ఆ ప్రకారమే పాలు, పెరుగు ధరలను వరుసగా తగ్గిస్తూ వచ్చాయి. ధరలు తగ్గించినప్పటికీ పాల అమ్మకాలు పెరగకపోవడంతో ఏజెంట్లు మళ్ళీ పాల ధరను స్వల్పంగా తగ్గించాలని కోరారు. ఆ ప్రకారం ఈ నెల 25 నుంచి ఆరోగ్య సంస్థ లీటర్ పాల ధరను రూ.66 నుండి రూ.65లకు తగ్గించనుంది. కేజీ పెరుగు రూ.76 నుండి రూ.74కు తగ్గించనుంది.

పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణికి డీఎంకే ఎమ్మెల్యేల నోటీసులు

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీసారా సంఘటనతో తమకు సంబంధాలున్నట్లు తప్పుడు ఆరోపణలు చేసిన పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి రాందాస్‌కు లాయర్ నోటీసులు పంపినట్లు డీఎంకే శాసన సభ్యులు ఉదయసూర్యన్, వసంతం కార్తికేయన్ ప్రకటించారు. కళ్లకుర్చి కల్తీ సారా వ్యాపారాలతో డీఎంకే ఎమ్మెల్యేలిద్దరికీ సంబంధాలున్నాయని ఇటీవల రాందాస్, అన్బుమణి వేర్వేరుగా ప్రకటనలు చేశారు. ఆ ఇద్దరి ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు. దీంతో తమపై తప్పుడు ఆరోపణలు చేసిన పీఎంకే నేతలు ఈ నెల 23లోగా భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఆదివారం పీఎంకే నేతలు ఇద్దరూ క్షమాపణ చెప్పకపోవడంతో వారిపై పరువునష్టం దావా వేయడానికి న్యాయవాది రిచర్డ్‌సన్ విల్సన్ ద్వారా నోటీసులు పంపినట్లు డీఎంకే ఎమ్మెల్యేలు తెలిపారు.


సహాయ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఆగస్టులో రాతపరీక్ష

పెరంబూర్, జూన్ 24: ప్రభుత్వ కళాశాలల్లో 4 వేల సహాయ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఆగస్టులో రాత పరీక్ష జరునుంది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ తన పద్దులో తెలియజేసింది. అలాగే, తిరుకోవిలూర్, సెంజి, శ్రీపెరుంబుదూర్ సహా 13 ప్రాంతాల్లో కొత్త ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలకు స్థలాలు ఎంపిక చేసినట్లు, మరో నాలుగు ప్రాంతాల్లో స్థలం ఎంపిక జరుగుతుందని ఉన్నత విద్యా శాఖ తెలియజేసింది.

కుట్రాలం జలపాతాల్లో స్నానాలకు నిషేధం

పెరంబూర్,జూన్24: తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతాల్లో పర్యాటకు స్నానాలకు జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. ఈ ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా జలపాతాల వద్ద నీటి ప్రవాహం అధికమైంది. దీంతో, ప్రధాన, ఐందరువి జలపాతాల్లో పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. అలాగే, ఆయా ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా పోలీసు, అటవీ శాఖ సిబ్బంది గస్తీ చేపట్టారని జిల్లా యంత్రాంగం తెలిపింది.

కల్తీసారా తాగి మృతి చెందిన వ్యక్తి శవం వెలికితీత



జయమురుగన్‌ను ఖననం చేసిన చోట అధికారుల సమక్షంలో తవ్వుతున్న కార్మికులు

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీసారా తాగి మృతి చెందిన వ్యక్తి శవాన్ని అధికారులు వెలికి తీశారు. కళ్లకుర్చి సమీపంలోని మాధవచ్చేరి ప్రాంతానికి చెందిన జయమురుగన్(45)ఇళయరాజా (35) ఈనెల 18న కల్తీసారా సేవించి ప్రాణాలు కోల్పోయారు. వీరిలో జయమురుగన్ మృతదేహాన్ని వారి కుటుంబీకులు ఖననం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల ఆర్థికసాయం అందించాలని కోరుతూ కుటుంబీకులు జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో ఇళయరాజా మృతదేహాన్ని దహనం చేయడంతో జయమురుగన్ శవాన్ని వెలికి తీసి పరీక్షలు జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు చెన్నై, విల్లుపురం, ముండియంబాక్కం ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన వైద్య బృందం మాధవచ్చేరి శ్మశానంలో జయమురుగన్‌ను పాతిపెట్టిన చోట తవ్వించి శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కళ్లకుర్చి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి పంపారు. పోస్టుమార్టం నివేదికలో జయమురుగన్ కల్తీసారా వల్లే మృతి చెందినట్లు నిర్ధారణ అయితే ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల ఆర్థిక సాయం కోసం ప్రతిపాదనలు పంపుతామని కలెక్టరేట్ అధికారులు పేర్కొన్నారు.



వేలూరు కలెక్టర్ కార్యాలయంలో శాంతి భద్రతలు, మాదకద్రవ్యాల నిర్మూలన చర్యలపై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వృద్ధుడిని కారుతో ఢీకొట్టిన తనయుడు

పెరంబూర్, జూన్ 24: ఆస్తి సమస్య కారణంగా తండ్రిని కారుతో ఢీకొట్టి హతమార్చిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా పులియంపట్టి సమీపం ఆలంద గ్రామానికి చెందిన కరుప్పుస్వామి (70)కి భార్య, చిన్నదురై (45) అనే కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు. కొద్ది కాలం క్రితం కరుప్పుస్వామి తన స్థలాన్ని సోలార్ సంస్థకు విక్రయించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు తరచూ తండ్రితో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో, సోమవారం ఉదయం ఆలంద రోడ్డులో కరుప్పుస్వామి నడిచి వెళుతుండగా, చిన్నదురై కారుతో ఢీకొట్టి హతమార్చాడు. సమాచారం అందుకున్న పులియంపట్టి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూత్తుకుడి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి చిన్నదురైను అరెస్ట్ చేసారు.

తగ్గిన నీటిమట్టం

● వివేకానంద రాక్‌కు పడవ సవారీ రద్దు

పెరంబూర్, జూన్ 24: కన్నియాకుమారి సముద్రతీరంలో నీటిమట్టం తగ్గడంతో వివేకానంద రాక్‌కు పడవ సవారీ తాత్కాలికంగా రద్దు చేశారు. కన్నియాకుమారి సముద్రం మధ్యలో ఏర్పాటుచేసిన వివేకానంద మండపం, తిరువళ్లూర్ విగ్రహాలను సమీపంగా వెళ్లి చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. పర్యాటకుల సౌకర్యార్థం పూంపుహార్ సంస్థ పడవలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం నీటిమట్టం తగ్గడంతో పడవ సవారీ రద్దు చేస్తున్నట్లు, నీటి పరిమాణం పెరిగితే పడవ సవారీ ప్రారంభిస్తామని సంస్థ అధికారులు తెలిపారు.

స్పీకర్ అప్పావుపై పరువు నష్టం కేసు

● విచారణకు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 24: అసెంబ్లీ స్పీకర్ అప్పావుకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే నాయకులు వేసిన పిటిషన్‌ను నమోదుచేసి, విచారించాలని చెన్నై ప్రిన్సిపల్ కోర్టుకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నగరంలో గత ఏడాది జరిగి పుస్తకావిష్కరణ సభలో మాట్లాడిన స్పీకర్ అప్పావు... జయలలిత మృతి అనంతరం 40 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ నిరాకరించారని ప్రసంగించారు. ఈ నేపథ్యంలో, అన్నాడీఎంకే ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన స్పీకర్‌కు వ్యతిరేకంగా అన్నాడీఎంకే న్యాయవాద విభాగం సంయుక్త కార్యదర్శి బాబు మురుగవేల్, చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పరువు నష్టం పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌ను ఫైల్ చేయకపోవడంతో, బాబు మురుగవేల్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయమూర్తి జి.జయచంద్రన్... పిటిషనర్ బాబు మురుగవేల్ పిటిషన్ ఫైల్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు ఉత్తర్వులు జారీచేశారు.

ముఠా తగాదాలకు యువకుడి బలి

అడయార్, జూన్ 24: నగర శివారు ప్రాంతమైన ముడిచ్చూరు వరదరాజపురం ప్రాంతంలో రెండు వర్గాల మధ్య ముఠా తగాదాల్లో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు పాల్పడిన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు... వరదరాజపురం ప్రాంతానికి చెందిన సంతోష్ (20), సూర్యగాంధీ (20) గంజాయి చిల్లరగా విక్రయిస్తుంటారు. ఈ విషయంలో వారిద్దరికి గొడవలున్నాయి. అయితే, ఇటీవల సంతోష్‌పై సూర్యగాంధీ దాడి చేసి, అతని మొబైల్‌ఫోన్ తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని సంతోష్ తన తల్లికి చెప్పడంతో ఆమె తన అనుచరులతో వెళ్ళి సూర్యగాంధీపై దాడి చేసి తన కుమారుడి మొబైల్ ఫోన్ తీసుకొచ్చింది. దీంతో సంతోష్‌ను హతమార్చాలని సూర్యగాంధీ కుట్రపన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ముడిచ్చూరు ప్రాంతంలోని ఒక మైదానంలో కూర్చున్న సంతోష్‌పై అనుచరులతో కలిసి సూర్యగాంధీ దాడికి యత్నించాడు. దీంతో సంతోష్, సూర్య గాంధీలతో వారి స్నేహితులు కూడా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడ నుంచి ప్రాణభయంతో పారిపోగా, అతని స్నేహితుడు విక్కి అనే యువకుడు చిక్కడంతో కత్తులతో దాడి చేయడంతో అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న సూర్యగాంధీ అతని ఇద్దరు అనుచరుల కోసం గాలిస్తున్నారు.

రథం విరిగిపడి వృద్ధుడి మృతి



పెరంబూర్, జూన్ 24: పుదుకోట జిల్లా అరంతాంగి సమీపం ముత్తుమారియమ్మన్ ఆలయ ఉత్సవాలకు రథం సిద్ధం చేసుండగా ఊహించని విధంగా విరిగిపడడంతో వృద్ధుడు మృతిచెందాడు. మాత్తూర్‌లోని ముత్తుమారి అమ్మన్ ఆలయ ఉత్సవాల కోసం రథం నిర్మాణాన్ని గ్రామస్తులు చేపట్టారు. రథం పీఠంపై చత్రాన్ని ఉంచే సమయంలో హఠాత్తుగా తాళ్లు తెగిపడి రథం ఓ పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో రథం కింద చిక్కుకున్న రామస్వామిపురానికి చెందిన ఎస్.మహాలింగం (70) సహా ఆరుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని పేరావూరణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక మహాలింగం మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

పేద కుటుంబానికి సమాజ సేవకుడు చేయూత



విద్యా ఉపకరణాలు, కిరాణా సరుకులు అందజేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, జూన్ 24: స్థానిక తోపుకానా ముత్తు మండపం ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్న తిలకవతి భర్త నాలుగు నెలల క్రితం మృతిచెందాడు. ఇంటి అద్దె కూడా కట్టలేని పరిస్థితిలో ఆ కుటుంబముంది. అలాగే, తిలకవతి ఇద్దరు కుమారులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వీరి కష్టాలు తెలుసుకున్న రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్ ఆ ఇద్దరు పిల్లలకు విద్యా ఉపకరణాలు, నెలకు సరిపడా కిరాణా సరుకులు అందజేసి, భవిష్యత్తులో మీ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

కేరళకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



వేలూరు, జూన్ 24: కేరళ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలతో అతి భారీ వర్షాలు కురుస్తాయని జాతీయ వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించింది. భారీవర్షాలకు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా ఆ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో, రాణిపేట జిల్లా అరక్కోణంలో ఉన్న జాతీయ విపత్తుల నివారణ బృందానికి చెందిన 210 మంది ఉప కమాండ్ శంకర పాండ్యన్ నేతృత్వంలో సోమవారం కేరళ బయల్దేరి వెళ్లారు. వీరు కొల్లం, ఆలపుఝా, ఎర్నాకులం, ఇడుక్కి, కోళికోడ్ తదితర ప్రాంతాల్లో విధులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

బీజేపీ నేతల అవినీతిని బయటపెడతా

● తిరుచ్చి సూర్య

ప్యారీస్, జూన్ 24: రాష్ట్ర బీజేపీ నేతల అవినీతి చిట్టాను త్వరలో బయటపెడతానని ఇటీవల ఆ పార్టీ నుంచి తొలగించిన తిరుచ్చి సూర్య పేర్కొన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో పోటీచేసిన బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. అందువల్ల ఆ పార్టీ నిర్వాహకులు ఓటమికి గల కారణాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకొని పోటీచేసి ఉంటే కొన్ని స్థానాల్లోనైనా గెలిచేవారమని తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీలో క్రిమినల్ కేసుల్లో చిక్కుకున్న వారు పదవుల్లో ఉన్నారంటూ ఆమె ఆరోపించారు. ఆమె లాగే ఐటీ విభాగం నిర్వాహకుడు కల్యాణరామన్, నటుడు ఎస్వీ శేఖర్ తదితరులు కూడా అన్నామలై తీరును తీవ్రంగా విమర్శించారు. ఇదిలా ఉండగా, బీజేపీ బీసీ విభాగం అధ్యక్షుడిగా ఉన్న తిరుచ్చి సూర్య పార్టీకి వ్యతిరేకంగా అభిప్రాయాలు తెలియజేసిన కారణంగా ఆయనను కూడా పార్టీ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో, తిరుచ్చి సూర్య సోమవారం మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ ఓటమిని టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టి వేడుకగా జరుపుకున్న బీజేపీ నేతల్లో ఎస్వీ శేఖర్ కూడా ఉన్నారని, ఆయన కలైంజర్ శతజయంతి వేడుకల్లో పాల్గొని అధికారపార్టీకి మద్దతుగా వ్యవహరించారని, అయినా ఆయనపై ఎలాంటి చర్యలు లేవన్నారు. డీఎంకే ప్రముఖులతో చేతులు కలిపి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ముఠాల నుంచి నెలకు రూ.50 లక్షల నుంచి రూ.80 కోట్ల వరకు కమీషన్ పుచ్చుకుంటున్న బీజేపీ నేతల వివరాలను త్వరలోనే వెల్లడిస్తానంటూ సూర్య తెలిపారు.

దక్షిణాది భాషలో సమాధానం చెప్పాల్సి ఉంటుంది

● శృతిహాసన్



ఉత్తరాది, దక్షిణాది అని విభజన చేసి మాట్లాడవద్దని, ఒక వేళ అదేవిధంగా మాట్లాడుతూవుంటే దక్షిణాది భాషలో సమాధానం చెబితే జీర్ణించుకోలేరని హీరోయిన్ శృతి హాసన్ పేర్కొంది. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో శృతిహాసన్ యాక్టివ్‌గా ఉంటుంది.. ఈ క్రమంలో తాజాగా ఆమెకు ఓ అభిమాని నుంచి వింత ప్రశ్న ఎదురైంది. దక్షిణాది బాణీలో ఏదైనా చెప్పండి అని ఓ అభిమాని ప్రశ్నకు శృతి హాసన్ ఘాటుగా సమాధానమిచ్చింది. 'ఇలా దక్షిణాది, ఉత్తరాది అని వేర్వేరుగా విభజన చేసి మాట్లాడొద్దు. ఇది ఒక రకమైన వివక్ష వంటిది. ఈ విభజన వాదాన్ని అంగీకరించలేం. అలాగే, ఉత్తరాదిలో ఉండేవారు దక్షిణాదివారిని చూసి సాంబార్, ఇడ్లీ అని హేళన చేసేలా కామెంట్స్ చేయడం ఏమాత్రం భావ్యంకాదు. హాస్యానికి కూడా అలా మాట్లాడొద్దు. అలా ఎవరైనా చెబితే.. దక్షిణాది బాణీలో వారికి సమాధానం చెప్పాల్సివస్తుంది' అని శృతి హాసన్ అన్నారు.

'గరుడన్' ఫేం దురై దర్శకత్వంలో లెజెండ్ శరవణన్



'లెజెండ్' శరవణన్

ప్రముఖ వస్త్రవ్యాపారి, సినీ నటుడు 'లెజెండ్' శరవణన్ కొత్త చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రాన్ని ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన 'గరుడన్' చిత్రానికి దర్శకత్వం వహించిన దురై సెంథిల్ కుమార్ డైరెక్ట్ చేయనున్నారు. 2022లో 'లెజెండ్' చిత్రం ద్వారా శరవణన్ కోలీవుడ్‌కు పరిచయమయ్యారు. జేడీ-జెర్రీ దర్శకద్వయం దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో తన తదుపరి చిత్రాన్ని ప్రారంభించారు. దురై సెంథిల్ కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం షూటింగ్ కూడా ఇప్పటికే ప్రారంభమైనట్టు తెలుస్తుంది. షూటింగ్ లొకేషన్‌లో లెజెండ్ శరవణన్ ఉన్న ఫొటోలను దర్శకుడు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇందులో లెజెండ్ శరవణన్ సరికొత్త కోణంలో కనిపిస్తున్నారు. గెడ్డం, మీసం, చేతిలో తుపాకీ పట్టుకుని ఉన్నారు. హీరో శివకార్తికేయన్‌కు 'ఖాకిసట్టై' చిత్రం ఎలా విభిన్న చిత్రంగా నిలిచిందో 'లెజెండ్' శరవణన్‌కు కూడా ఈ చిత్రం నిలుస్తుందని దర్శకుడు చెబుతున్నారు.

రజనీ కోసం స్క్రిప్టులో మార్పులు?



లోకేష్ కనకరాజ్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఓ చిత్రంలో నటించనున్నారు. 'కూలీ' పేరుతో తెరకెక్కించే ఈ చిత్రంలో అనేక పోరాట సన్నివేశాలున్నాయి. అయితే, రజనీకాంత్ వయసు దృష్ట్యా స్టంట్స్ సీక్వెన్సెస్‌లో దర్శకుడు మార్పులు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం రజనీకాంత్ 'వేట్టయన్' చిత్రంలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటుంది. అక్టోబరులో ప్రేక్షకుల ముందుకురానుంది. ఆ తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించనున్నారు. ఇందులో సత్యరాజ్, అభిరామి, శృతిహాసన్ ఇలా అనేక మంది ప్రధాన తారాగణం ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. యాక్షన్ భరిత వినోదాత్మక అంశాలతో రూపొందించేలా దర్శకుడు స్క్రిప్టు సిద్ధం చేసుకున్నారు. అయితే, రజనీకాంత్ వయసు దృష్టిలో ఉంచుకుని సినిమాలోని అనేక స్టంట్ సన్నివేశాలను తొలగించాలని దర్శకుడు ఓ నిర్ణయం తీసుకుని, అందుకు అనుగుణంగా స్క్రిప్టు మార్చినట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

చిత్రజ్యోతి

విజయ్ సరసన జాన్వీ?




జాన్వీ కపూర్

అగ్రనటుడు విజయ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ నటించనుందనే వార్త కోలీవుడ్‌లో హల్చల్ చేస్తుంది. ప్రస్తుతం విజయ్ 'ది గోట్' చిత్రంలో నటించారు. ఆ తర్వాత హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ తన 69వ చిత్రంలో నటించనున్నారు. ఇందులో పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించినప్పటికీ చివరకు జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఇటీవలకాలంలో జాన్వీ కపూర్ ఎక్కువగా ముంబై టు చెన్నై మధ్య చక్కర్లు కొడుతున్నారు. చెన్నైతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని పుణ్యస్థలాలను సందర్శిస్తోంది. అయితే, తన తల్లి శ్రీదేవి నిలదొక్కుకున్న తమిళంలో తాను ఎంట్రీ ఇచ్చేందుకు ఆమె ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తన కుమార్తె కోర్కెను తీర్చేందుకు ఆమె తండ్రి, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ ముందుకు వచ్చారు. విజయ్ 69వ చిత్రంలో కుమార్తెకు అవకాశం ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి కారణం లేకపోలేదు. హెచ్.వినోద్ దర్శకత్వంలో అజిత్ హీరోగా నటించిన 'వలిమై', 'తుణివు' చిత్రాలను బోనీ కపూర్ నిర్మించారు. దీంతో దర్శకుడు హెచ్.వినోద్ - బోనీ కపూర్ మధ్య మంచి సత్సంబంధాలు ఉండటంతో విజయ్ చిత్రంలో జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా నటింపజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని టాక్ వినిపిస్తుంది.

ఎంత పని చేశావే కల్వరాయన్ మలై?!

● కళ్లకుర్చి వాసుల కష్టాలకు ఇక్కడి సారాయే కారణం



పచ్చదనంతో నిండిన కల్వరాయన్ మలై ప్రాంతం - కల్వరాయన్‌మలైలోని లోయలు

(ఆంధ్రజ్యోతి, చెన్నై)

కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీసారా తాగి 60 మంది మృతి చెందిన సంఘటన దేశం ఉలిక్కిపడేలా చేసింది. గత నాలుగు రోజులుగా ఈ సంఘటనపై విచారణ జరిపిన సీబీసీఐడీ నిరుపేద కార్మికులను బలితీసుకున్న సారా కల్వరాయన్ మలై నుంచి సరఫరా అయిందని గుర్తించారు. ఆ పర్వత ప్రాంతం నుంచి తీసుకొచ్చిన సారాలో మోతాదుకు మించి వ్యాపారులు మెథనాల్ కలపడం వల్లే మృతుల సంఖ్యల క్షణాల్లో పెరిగిందని కనుగొన్నారు. అంతే కాకుండా ఆ కల్వరాయన్ మలై ప్రాంతం నుంచే ఎన్నో ఏళ్లుగా రాష్ం అంతా సారా సరఫరా అవుతున్నట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. సారా తయారీకి ప్రధాన కేంద్రంగా మారిన కల్వరాయన్ పర్వత ప్రాంతం పచ్చదనంతో దట్టమైన అడవులతో ఉంది. కొండలు కోనలు, వాగులు, వంకలు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ ప్రాంతంలో ఐదువేల సంవత్సరాలకు ముందే ప్రజలు జీవించారని, అక్కడి కొండలపై ఆదిమానవులు చెక్కిన చిహ్నాలు, బొమ్మలు సాక్ష్యం చెబుతున్నాయి. సంగకాలంలో ఈ పర్వత ప్రాంతం 'మలైమాన్' రాజ్యం పరిధిలో ఉండేదని చెబుతున్నారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన వారిని 'మలైయర్‌గళ్' అని పిలిచేవారు. వీరంతా చేర, చోళ, పాండ్య చక్రవర్తుల ఏలుబడిలో సామంతరాజులుగా ఉండేవారు. మలయర్లు వేటాడడంలో ఆరితేరినవారు. యుద్ధవీరులుగాను పేరుగాంచారు.




కల్వరాయన్‌మలైలోని వాగు

యుద్ధవీరుల స్థావరం...

1360 సంవత్సరం తర్వాత కల్వరాయన్ మలై ప్రాంతం కాంచీపురాన్ని పరిపాలించిన విజయనగర రాజుల పాలనలోకి వచ్చింది. అప్పట్లో దళాధిపతులుగా పిలువబడే వెళ్లాలర్లు వేటాడేందుకు కల్వరాయన్‌మలైకి వెళ్ళి, అక్కడే నెలల తరబడి బసచేసేవారు. ఆ తర్వాత స్వస్థలానికి తిరిగి వెళ్ళిన వీరికి చేదు అనుభవాలు ఎదురయ్యేవి. నెలల తరబడి కల్వరాయన్‌మలైలోనే ఉండటం వల్ల వారు ఆ అడవిలో పులులు, సింహాల బారినపడి ప్రాణాలు కోల్పోయి ఉంటారని భావించి వారికి అంత్యక్రియలు జరిపిన వారి భార్యలు వితంతువులుగా మారేవారు. ఎన్నో ఆశలతో గ్రామానికి చేరుకున్న వారికి తమ భార్యలు వితంతువులుగా కనిపించడం పెద్ద ఆశనిపాతంగా ఉండేది. ఈ కారణంగా ఆ యుద్ధవీరులను మళ్ళీ కాంచీపురంలో అడుగుపెట్టనిచ్చేవారు కాదు. దీంతో ఆ వీరులంతా మళ్ళీ కల్వరాయన్ మలైకి చేరుకుని అక్కడే స్థిరనివాసమేర్పరచుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న మలయర్లకు, ఈ యుద్ధవీరులకు మధ్య ఆధిపత్యం కోసం యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కాంచీపురం యుద్ధవీరులు విజయం సాధించి అక్కడే శాశ్వత నివాసమేర్పరచుకున్నారు. ప్రస్తుతం ఆ పర్వత ప్రాంతంలో మలయర్లు, కాంచీపురం యుద్ధవీరుల కుటుంబీకులే వంశపారంపర్యంగా నివసిస్తున్నారని చెబుతారు. ఆంగ్లేయుల కాలంలో ముగ్గురు జాగీర్‌దార్లు పరిపాలించారు. చిన్న కళ్వరాయన్ మలై, పెరియ కళ్వరాయన్ మలై అంటూ ఈ ప్రాంతాన్ని విభజించుకుని పాలించేవారు. ఈ ప్రాంతంలో జన, మరణాలకు పన్నులు, వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక పన్నులు, వ్యవసాయానికి పన్ను అంటూ వివిధ రకాల పన్నులు వసూలు చేసేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఈ జాగీర్‌దారులే కల్వరాయన్‌మలైని పరిపాలించారు. భారతదేశంలో విలీనం కావడానికి కూడా నిరాకరించే ఈ కల్వరాయన్‌మలైని ప్రత్యేక సంస్థానంగా ప్రకటించుకుని మరీ పరిపాలించారు. చివరకు 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో బానిసత్వ నిర్మూలన చట్టం ప్రయోగించి కల్వరాయన్‌మలైని తమిళనాడులో విలీనం చేశారు. ప్రస్తుతం కల్వరాయన్ మలైలో ఎక్కువభాగం కళ్లకుర్చి జిల్లా పరిధిలో ఉంది, తక్కిన భాగాలు తిరువణ్ణామలై, సేలం, ధర్మపురి జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఆ పర్వత ప్రాంతంలో 170 కుగ్రామాలున్నాయి. 75 వేలమంది నివసిస్తున్నారు. తూర్పు కనుమల పరిధిలో ఉండే ఈ పర్వత ప్రాంతంలో ఎక్కువ భాగం అటవీశాఖ పరిధిలో ఉంది. ఈ కారణంగా ఆ పర్వతంలోని గ్రామాలను కలిపేందుకు రహదారి సౌకర్యాలు లేవు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా లేవు. అక్కడి ప్రజలంతా చిలగడదుంపలు, కర్రపెండలం సాగుచేస్తుంటారు. ఏడాదికొకమారే ఆ పంటలను పండించగలుగుతారు. ఈ కారణంగా ఇక్కడి వ్యవసాయ కూలీలంతా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్ళి కూలీపనులు చేస్తుంటారు. అలా పొరుగు రాష్ట్రాలకు వెళ్ళి కూలీ పనులు చేయడానికి ఆసక్తికనబరచని వారంతా సులువుగా డబ్బు సంపాదించడానికి కల్తీసారా వ్యాపారం ఎంచుకున్నారు. ఈ కొండపై ప్రజలు సారా తయారు చేసే విధానాన్ని చూసి రాష్ట్రంలోని మద్యం వ్యాపారులు సైతం విస్తుపోతున్నారు. చిట్టడవులు కలిగిన కల్వరాయన్‌మలై పోలీసుల నుంచి తప్పించుకు తిరగటానికి సులువుగా కొండగుహల్లో, పొదల మాటున దాగేందుకు సారా తయారీదారులకు అనువుగా ఉంది. ఇతర జిల్లాల నుంచి వచ్చే సారా వ్యాపారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి స్థానికులు సారా తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. తాము తయారు చేస్తున్న సారా వల్ల కలిగే ప్రాణాపాయం గురించి ఈ కొండవాసులకు తెలియదు. పొరుగు జిల్లాలకు చెందిన కల్తీసారా వ్యాపారులంతా ఈ కొండవాసులు తయారు చేసే సారాను భారీ స్థాయిలో కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కల్వరాయన్‌మలై కల్తీసారా వ్యాపారుల సామ్రాజ్యంగా మారిందనటం అతిశయోక్తి కాదు. పూర్వం యుద్ధవీరుల స్థావరంగా పేరుగడించిన కల్వరాయన్‌మలై ప్రస్తుతం కల్తీసారా తయారీదారుల సామ్రాజ్యంగా మారింది.

ఇంటిలోనే సారా తయారీ...

ఈ కల్వరాయన్ మలై వాసుల జీవిత విశేషాలతో అనంతపురం కె.కృష్ణమూర్తి ఓ పుస్తకం రచించారు. ఈ పుస్తకాన్ని 1994లో అప్పటి సౌత్‌ఆర్కాడు జిల్లా కలెక్టర్ రామకృష్ణన్ వెలువరించారు. ఆ పుస్తకంలో కల్వరాయన్‌వాసులకు తాగుడు అలవాటు ఉందని పేర్కొన్నారు. ఆడ, మగ, చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా సారా తాగేవారు. ఇళ్లలో సారా ఎల్లప్పుడు నిల్వ వుంటుందని ఆ పుస్తకంలో తెలిపారు. ఇంటికొచ్చే అతిథులకు కూడా సారా ఇచ్చేవారు. సారా ఆరోగ్యానికి చేటు కలిగిస్తుందని ఎన్నడూ భావించరు. టీ, కాఫీ రీతిలోనే సారా తాగేవారు. ఈ కొండపైకి ట్రెక్కింగ్ వెళ్లే యువతీ యువకులు కూడా కొండసరకు రుచి చూడటం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం ఆ కొండపై ప్రతిఇంటిలో సారా తయారీ కుటీర పరిశ్రమగా కొనసాగుతోంది.



మట్టిదారిలోని కల్వర్టు

కొండ సరకు...

కల్వరాయన్ మలై చుట్టూ ఉన్న జిల్లాలకు చెందినవారికి 'మలై సరక్కు' (కొండ సరకు) అంటే చాలా ఇష్టం. ఎందుకంటే ఆ ప్రాంతంలో లభించే మేలి రకం దాల్చిన చెక్కలు, వనమూలికలు, కరక్కాయలు వంటి ప్రకృతిసిద్ధమైన వాటితో ఆ కొండపై వాగుల్లో ప్రవహించే మూలికల నీటితో సారా తయారు చేస్తారు. అలా తయారు చేసే సారా తాగితే శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని, ఆరోగ్యానికి మంచిదని భావిస్తుంటారు. ఆ సారా మధుమేహాన్ని నయం చేస్తుందని కూడా కొందరి నమ్మకం. ప్రకృతి సిద్ధంగా తయారవుతున్న ఈ సారాను వందలాది లీటర్ల చొప్పున కొనుగోలు చేసే సారా వ్యాపారులు వాటిలో మంచినీరు అధికంగా కలిపి, మత్తు కోసం మెథనాల్ కలిపి అమ్ముతుండటం వల్లే అమాయకులైన కూలీనాలీ జనాలు తక్కువ ధరకు వచ్చిందన్న సంతోషంతో ఆ కల్తీసారా తాగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ మెథనాల్‌ను మోతాదుకు మించి కలపటం వల్లే కళ్లకురిచ్చి కరుణాపురంలో 60 మందికి పైగా మృతి చెందారని, వందమందికి పైగా బాధితులు కోలుకోలేని స్థితిలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సీబీసీఐడీ పోలీసులు చెబుతున్నారు. కల్వరాయన్‌మలై తయారుచేస్తున్న పానీయాన్ని సారాగా భావించకుండా దానిని మలై సరకుగా భావించే ఆడ, మగా అనే తేడా లేకుండా తాగుతున్నారని తెలిపారు. కరుణాపురంలో అమ్ముతున్నది కల్వరాయన్‌మలై నుంచి వచ్చిన మేలైన మలై సరకుగా భావించి, అందులో విషపూరితమైన మెథనాల్ ఉందనే విషయం తెలియక కల్తీసారా తాగి ప్రాణాలు కోల్పోయారని చెబుతున్నారు. అంతా సరే..! ఆ కల్వరాయన్‌మలైలో యేళ్లతరబడి సాగుతున్న సారా తయారీ నిరోధించడం ఎలా అనే ప్రశ్నకు పోలీసులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. సారా తయారీదారులను కల్వరాయన్ మలై అడవుల్లో పట్టుకోవడం అంత సులభం కాదని చెబుతున్నారు. చందనపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను పట్టుకునేందుకు ఏర్పాటైన ప్రత్యేక దళాలను ఆ కొండపై మోహరించినా సారా తయారీదారులను పట్టుకోవడం అసాధ్యమని కళ్లకురిచ్చి, విల్లుపురం, ధర్మపురి, సేలం జిల్లా వాసులంతా నొక్కివక్కాణిస్తున్నారు.

విమానంలో నగరానికి మదురై విద్యార్థులు



విమానాశ్రయంలో విద్యార్థులతో మదురై మేయర్ ఇంద్రాణి, కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

పెరంబూర్, జూన్ 24: మదురై కార్పొరేషన్ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఓ సంస్థ సాయంతో విమానంలో నగరానికి వచ్చారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'ఆకాశంలో విహరిద్దాం' అనే శీర్షికతో మదురై కార్పొరేషన్ పాఠశాలలకు చెందిన 10 మంది విద్యార్థినీ, విద్యార్థులను ఎంపిక చేశారు. మదురై కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి, కమిషనర్ దినేస్‌కుమార్ విమానాశ్రయంలో విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పది మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కలిపి 11 మంది మదురై నుంచి విమానంలో చెన్నై బయల్దేరారు. వారందరూ సోమవారం అసెంబ్లీ సమావేశాలు చూసి మళ్లీ బస్సులో మదురై చేరుకున్నారు. మొదటిసారి విమానంలో ప్రయాణించడం మరుపురాని అనుభూతి అని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రికి గ్రామస్తుల కృతజ్ఞతలు



సీఎం స్టాలిన్‌ని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న కందాదేవి గ్రామస్తులు

పెరంబూర్, జూన్ 24: పద్దెనిమిదేళ్ల అనంతరం రథోత్సవం వైభవంగా నిర్వహించడంతో, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను గ్రామస్తులు స్వయంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. శివగంగ జిల్లా కందాదేవి సొర్ణమూర్తేశ్వర స్వామి ఆలయ రథోత్సవం 18 ఏళ్ల అనంతరం అత్యంత వైభవంగా నిర్వహించారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వ ప్రయత్నాలతో, ప్రజల సహకారంతో రథోత్సవం నిర్వహించారు. దీంతో, స్థానిక క్యాంప్ కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు సీఎంను కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. పరుగెత్తని తిరువారూరు రథాన్ని నడిపిన కలైంజర్ కుమారుడిగా గర్విస్తున్నానని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ల నిజాయితీ

అభినందించిన పోలీస్ కమిషనర్



జనార్దనన్, సహాయరాజ్‌ను అభినందిస్తున్న కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

పెరంబూర్, జూన్ 24: రోడ్డుపై దొరికిన నగదును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్లను పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ అభినందించారు. పెరంబూర్ పొన్నుస్వామి నగర్‌కు చెందిన సహాయరాజ్, అయనావరం ఈకంగిపురం 4వ వీధికి చెందిన జనార్ధనన్ అనే ఆటో డ్రైవర్లు ఈ నెల 20వ తేది రాత్రి ఆటోలో వస్తుండగా ముందు ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి ప్యాకెట్ నుంచి నగదు కిందపడింది. గమనించకుండా ఆ వ్యక్తి వెళ్లిపోతుండగా వీరు, అతడిని ఆగమని కేకలు వేసినా వెళ్లిపోయాడు. దీంతో అతను రూ.10,000 పోగొట్టుకున్నట్లు గుర్తించారు. వారు వెంటనే ఆ నగదును ఓట్టేరి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్, జనార్ధనన్, సహాయరాజ్‌ను సోమవారం కార్యాలయానికి పిలిపించి, వారిని అభినందించి ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.